# మూడు దశాబ్దాల మైలురాయిని దాటిన బెంగళూరు - నిజాముద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రస్థానం

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దేశంలోనే విశిష్ట స్థానం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ జిల్లాల మీదుగా దేశ రాజధాని ఢిల్లీకి, రాష్ట్ర రాజధానుల నుంచి నిత్యం వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రస్థానం ప్రారంభమై మూడు దశాబ్దాలు విజయవంతంగా గడిచింది. కేంద్ర రైల్వే శాఖామంత్రి దివంగత సికె జాఫర్‌షరీఫ్, 1992-93 రైల్వే వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెడుతూ, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దేశ రాజధాని ఢిల్లీకి రాకపోకలు సాగించే కేంద్ర, రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, బ్యూరోక్రాట్‌లు, వాణిజ్య, వ్యాపార వర్గాల ఉపయోగార్థం బెంగుళూరు-సికింద్రాబాద్-హజరత్ నిజామొద్దీన్ (న్యూఢిల్లీ)ల మధ్య రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశ పెడుతున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు రైల్వే శాఖ తొలి రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను హౌరా-న్యూఢిల్లీల మధ్య 1969 మార్చి 1న ప్రారంభించి, క్రమేనా ముంబై సెంట్రల్-న్యూఢిల్లీ తదితర రాష్ట్రాలకు విస్తరించారు. దేశంలోనే అత్యంత వేగంగా తిరిగే రైలుగా ఖ్యాతి గడించిన రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు దక్షిణాది ప్రాంతాలను కలుపుతూ దేశ రాజధానికి అనుసంధానం చేయడం ద్వారా ఆయా కేటగిరిల, విభాగాల సంబంధిత వర్గాలకు ఈ రైలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని 1992 నవంబర్ 01న బెంగుళూరు నుంచి సికింద్రాబాద్ మీదుగా హజరత్ నిజాముద్దీన్ల మధ్య తిరిగే నెంబర్ 2429/30 రాజధాని వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను బెంగుళూరులో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో నాటి రైల్వే మంత్రి జాఫర్ షరీఫ్ ప్రారంభించారు. ప్రారంభంలో 90 కిలోమీటర్ల వేగంతో తిరిగిన రాజధానిఎక్స్‌ప్రెస్ , ప్రస్తుతం 130 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతోంది. ఈ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లను కాల క్రమేనా బై వీక్లీ, ట్రై వీక్లీ, వారికి 4 సార్లు, నడిపించి ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రస్తుతం కొత్త నెంబర్ 22691/92తో డైలీ ఎక్స్‌ప్రెస్ రైలుగా రైల్వే శాఖ నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. 2,366 కిలోమీటర్ల ఈ మార్గాన్ని కేవలం 33 గంటల 55 నిమిషాల్లో గమ్యస్థానం చేరుకుంటుంది.

1992 నవంబర్ 01న తొలి రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లను రాయలసీమలోని ధర్మవరం-గుంతకల్లు మధ్య విధులు నిర్వర్తించిన క్రూ సిబ్బందిగా సిడి జయరావు, నిత్యానందన్‌లు నడుపగా, గార్డుగా ఎస్.రామనాయక్ విధులు నిర్వర్తించారు. అలాగే గుంతకల్లు-సికింద్రాబాద్ మధ్య పిఎంఆర్‌రామణ్ణకుట్టి, భక్తావత్సలంలు రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడిపిన తొలి డ్రైవర్లుగాను, గార్డుగా కె.ఈశ్వరయ్యలు రైల్వే రికార్డు పుటల్లోకిఎక్కారు. ఏదిఏమైనా రాయలసీమలో అత్యంత వేగంగా తిరిగే రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులు పట్టాలిఎక్కి నేటికీ మూడు దశాబ్దాల మైలురాయిని దాటింది.

# జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పారిశుధ్య నిర్వహణ తీరుపై పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం



**జగ్గయ్యపేట, అక్టోబర్ 31, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో పారిశుధ్య నిర్వహణల తీరుతెన్నులు ఏమాత్రం బాగాలేవని, సిబ్బంది కౌన్సిలర్ల మాటను ఖాతరచెయ్యకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార వైఎస్‌ఆర్‌సిపి, ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. సోమవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షత వహించారు. వైస్-చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన లారీని ఉపయోగించటం లేదని, జనావాసాల వద్ద చెత్త డస్ట్‌బిన్స్‌ను తొలగించాలని సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా లక్ష్యపెట్టటం లేదని మండి పడ్డారు. ప్రతిపక్ష సభ్యులు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, నకిరికంటి వెంకట్ కూడా పారిశుధ్య నిర్వహణ తీరుపై విమర్శలుచేశారు. చెత్తపన్నును ప్రజల నుండి ఈప్రభుత్వం వసూలుచేస్తుందంటూ విచారం వ్యక్తంచేశారు. చైర్మన్ రాఘవేంద్ర ఆదేశంతో కమిషనర్ రాం భూపాలరెడ్డి వివరణ ఇచ్చారు. 2014 నుండి చెత్త, పారిశుధ్య నిర్వహణలపై కార్యాచరణ మొదలైందని, 2017లో తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన పదార్థాలకు సంబంధించి మూడు విభాగాలుగా ప్రజల నుండి చెత్తను సేకరించే విధానం ప్రారంభమైందని అన్నారు. అయితే నేషనల్ ట్రిబ్యూనల్‌లో హైకోర్టు విశ్రాంత జడ్జిద్వారా విచారణ చేపట్టారని, కంపోస్టు ఎరువు పథకం అమలులో చెత్తను మూడు విధాలుగా ప్రతి ఇంటి నుండి సేకరించే కార్యక్రమం మొదలు పెట్టారన్నారు. ఇది కొనసాగటంలో అవాంతరాలు వచ్చాయని, పట్టణంలో శానిటేషన్ నిర్వహణకు సంబంధించిన వాహనం మరమ్మతులకు పంపటం జరిగిందన్నారు. ఇక చెత్తపన్ను రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతున్న అంశమని జగ్గయ్యపేటకే పరిమితమైనది కాదన్నారు. ప్రతిపక్ష సభ్యుడు వెంకట్ మాట్లాడుతూ ఇక్కడ పారిశుధ్య నిర్వహణ వైఫల్యం ఎవరిది అంటూ ప్రశ్నించారు. మూడు నెలలుగా ఈసమస్యపై అడుగుతుంటే ఒకేరకమైన సమాధానం ఇస్తున్నారంటూ నిగ్గదీశారు. మరోక ప్రతిపక్ష సభ్యురాలు కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ వాహనం పూర్తిగా పాడైపోయేవరకు ఎందుకు నిరీక్షించారని ప్రశ్నించారు. వీధుల్లో కేవలం సున్నం మాత్రమే చల్లుతున్నారని, బ్లీచింగ్ ఎందుకు వాడటంలేదు, ఎక్కడ వాడుతున్నారంటూ ప్రశ్నించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె దుర్గాప్రసాదు సమాధానమిస్తూ బ్లీచింగ్ అయిపోవటం వలన కౌన్సిల్ ఆమోదం పొంది తిరిగి ఏర్పాటుచేసుకునే ప్రక్రియలో ఉన్నామన్నారు. 31వ వార్డు గింజుపల్లి వెంకట్రావు మాట్లాడుతూ మూడు నెలలుగా మంచినీటి పంపుల్లో నీరు రావటం లేదని, ఫిర్యాదుచేసినా సిబ్బందిలో నిర్లక్ష్యం కన్పిస్తుందని ఆరోపించారు. ఈవిషయాలు తిగిరి మాట్లాడుదామని చైర్మన్ సూచించగా ప్రతిపక్ష సభ్యులు సైదేశ్వరరావు, వెంకట్ సదరు సభ్యుడిని సమస్య గురించి మాట్లాడనివ్వండంటూ చైర్మన్‌ను అడిగారు. దీంతో వైస్‌చైర్మన్ ప్రభాకరరావు మీ విషయాలు మీరు మాట్లాడండి అంటూ సమాధానం ఇవ్వగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎవరు ఏమి మాట్లాడుతున్నారో అర్థంకాని పరిస్థితుల్లో చైర్మన్ రాఘవేంద్ర కలుగుజేసుకుని అందరూ కూర్చోవాలని సూచించారు. అయినా వాగ్వాదాలు కొనసాగుతుండటంతో వారించినా వినకపోతే సస్పెండ్ చెయ్యాల్సి వస్తుందని హెచ్చరించారు.

# వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాల్సిందే

## - రైతులకు అనుకూలమైన విధానాలు ఈ ప్రభుత్వంలో లేవు

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శిరామకృష్ణ




**అనంతపురం, అక్టోబర్ 31 ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో అధిక వర్షాలకు లక్షల ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోతే రెవెన్యూ అధికారులు వేలల్లో చూపిస్తున్నారని సర్వే నివేదికలు తప్పుల తడకగా మారాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఏపి రైతు సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ సంయుక్తంగా పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుదేలైన పంటలను ఈ నెల 27 నుంచి 3 రోజులపాటు సిపిఐ, రైతు సంఘం జిల్లా నాయకులు పరిశీలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనష్టపోయిన రైతులకు వెంటనేపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐ, రైతు సంఘం నేతలు జిల్లా కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ మల్లికార్జున అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఐ నేత రామకృష్ణ, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌తోపాటు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అకాల వర్షాలు పంటలను పూర్తిగా దెబ్బతీశాయని వాటితోపాటు పలు చోట్ల ఇళ్లు కూలిపోయి ఆస్తులు సైతం నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విపత్కర పరిస్థితులు దాపురించిజిల్లాలో లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని వందల కోట్ల రూపాయల నష్టం జరిగిందన్నారు. అయితే కేవలం 9 వేల 8 వందల ఎకరాలు మాత్రమే పంటలు దెబ్బతిని 16.50 కోట్లు నష్టం జరిగిందని రెవెన్యూశాఖ అధికారులు అంచనాలు తప్పుల తడకలుగా ఉన్నాయని అధికారులు బుద్దిలేకుండా వ్యవహరిస్తున్నారని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. లక్షల్లో రైతులు పంటలు నష్టపోయిన విషయం ప్రత్యేక్షంగా కనపడుతోందని సిపిఐ శ్రేణులు నష్ట పోయిన ప్రాంతాల్లో పర్యటించి బాధిత రైతుల ద్వారా పూర్తి సమాచారాం సేకరించారన్నారు. వెంటనే వాణిజ్య పంటలు నస్‌పటోయిన రైతులకు ఎకరాకు 25వేలు, పండ్లతోటలకు ఎకరాకు 50వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. నగరంలోనిమ ఉంపు ప్రాంతాల్లో బాధతుల కుటుంబానికి 10వేల రూపాయలు పరిహారం చెల్లించాలని, ఇళ్లు కాలిన వారికి పూర్తి స్థాయిలో న్యాయంచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం రాష్ట్రప్రధానకార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా అనంత జిల్లా అధిక వర్షాలు వ్యసాయ పంటలను అతలాకుతలం చేశాయని తద్వారా రైతులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాలకు రైతాంగం పచ్చి కరువును ఎదుర్కొంటోందని ప్రభుత్వం బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఇతర రైతు సంఘాల మమేకంతో ప్రభుత్వానికి బుద్ది చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆయా నియోజకవర్గాల కార్యదర్శిలు, అనుబంధ సంఘాల నాయకులు, జిల్లా వ్యాప్తంగా వచ్చిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తసంద్రమైన ఇంద్రకీలాద్రి

## కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు



**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 31, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం కార్తీకమాస మొదటి సోమవారం సందర్భంగా శివభక్తులతో పోటెత్తింది. విజయవాడలోని శైవ క్షేత్రాలన్నీ భక్తకోటితో క్రిక్కిరిసింది. ఉదయం నుండి దుర్గమ్మ పాదాల చెంత కృష్ణానదిలో కార్తీక స్నానమాచరించి వివిధ శైవ దేవాలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. శైవాలయాలో నమక, చమకం, అంగన్యాస, కరన్యాస మహామంత్ర పఠనంతో క్షీరాలతో, కొబ్బరి నీటితో, చక్కెర, అరటి, డ్రై ఫ్రూట్స్ యైన ఖర్జూర, కిస్‌మిస్, జీడిపప్పు, బాదంపప్పు తదితరాలతో పంచామృతాభిషేకం, మహా రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు వేద పండితులు నిర్వహించారు. పితృదేవతలకు దారిచూపడానికి ప్రతీకగా కార్తీకమాసం సాయం దీపాలను వెలిగించారు. పంచారామాలు, అలాగే ఇంద్రకీలాద్రిపై కార్తీక మాసం సందర్భంగా నిత్యం స్వామి అమ్మవార్లను ఊయలలో ఉంచి అర్చకులు ఊంజలసేవ చేస్తుండగా, భక్తులు స్వామి అమ్మవార్ల చుట్టూ వున్న సహస్ర దీపాలను వెలిగించారు. నిత్యం సహస్ర లింగాలను అర్చక స్వాములు తయారు చేసి, లింగాకారములో అలంకరించి సహస్ర లింగార్చన పూజలు, నిత్య ఆర్జిత సేవలైన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణార్చన, చండీహోమం, శాంతికళ్యాణం మరియు ఇతర సేవలు నిర్వహించడమైనది. కార్తీకమాసంలో నిత్యము నిర్వహించే ఈ ప్రత్యేక పూజలను కార్తీక మాసాంతము వరకు నిర్వహిస్తారని ఆలయ ఇవో దర్భముళ్ల బ్రమరాంభ తెలిపారు.

**- నిత్యన్నదాన పథక విరాళం :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిత్యము నిర్వహించే అన్నదాన కార్యక్రమమునకు విరాళముగా విజయవాడ, లబ్బీపేటకు చెందిన ఎం.అలేఖ్య పేరు మీద వారి కుటుంబ సభ్యులు రూ.1,01,116/-లు,కానూరుకు చెందిన ఎ.పూర్ణచంద్ మరియు కుటుంబ సభ్యులు రూ.1,01,116/-లు విరాళమును ఆలయ అధికారులకు అందచేశారు. వీరికి స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేద పండితుల ఆశీర్వచనం, తదుపరి అమ్మవారి ప్రసాదము, శేషవస్త్రము అందచేశారు.

# పవన్ కళ్యాణ్‌వి వీకెండ్ పాలిటిక్స్

## - టిడిపి, జనసేనలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

## - అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ

**అనంతపురం, అక్టోబర్ 31 ప్రభాతవార్త బ్యూరో:** జనసేన అధినేతపవన్‌కళ్యాణ్ వీకెండ్ పాలిటిక్స్ చేస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ప్రజల సమస్యలు వినడానికి అంటూ ఆయన నిర్వహిస్తున్న జనవాణిలో కేవలం తన వాణి మాత్రమే వినిపిస్తూ.. ప్రభుత్వంపై, సీఎం జగన్‌పై విమర్శలు చేయడమే నపిగా పెట్టుకున్నారని తెలిపారు. సోమవారం నగరంలోని 17వ డివిజన్‌లో కార్పోరేట్ నాగవినుతతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఓ వైపు సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూనే మరోవైపు స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్దం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగన్ నాయకత్వంలో ఎన్నడూ, ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. కులం, మతం, వర్గం, రాజకీయ పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. గడిచిన మూడేళ్లలో ఏకంగా లక్షా 72 వేల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమా చేసినట్లు తెలిపారు. ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని అన్నారు. అర్హత ఉండి ఇంకా ఎవరికైనా పథకాలు అందడం లేదా..? స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అని తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం చేపడుతున్నామన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి సచివాలయానికి 20లక్షలు చొప్పున కేటాయించారని, నియోజకవర్గంలో రూ.17 కోట్లతోపాటు జనరల్ ఫండ్స్‌ను వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. సీఎం జగన్‌కు వస్తున్న జనాధరణ చూసి ఓర్వలేక అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమిచేయని చంద్రబాబు ఇప్పుడు కుట్రలు చేస్తున్నారని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, పలువురు కార్పోరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివలయ సిబ్బంది, వాలెంటీర్లు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ విధానం

## వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి

## జగ్గయ్యపేటలో వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకవర్గ ప్రమాణస్వీకారం - స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం

**జగ్గయ్యపేట, అక్టోబర్ 31, ప్రభాతవార్త :** భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపే చూస్తున్నాయని, రైతు సంక్షేమమే ప్రభుత్వ విధానంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సుపరిపాలన చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎంఎల్‌ఏ సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి, ఏపి రాష్ట్ర స్పోర్ట్స్ అధారిటీ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు. రూ.14 కోట్లతో చేపడుతున్న జగ్గయ్యపేట-చిల్లకల్లు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపనచేసి రూ.35 లక్షలు వ్యయంచేసి ఆధునీకరించిన స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటి చైర్మన్‌గా ముత్తినేని విజయశేఖర్, ఉపాధ్యక్షునిగా మానేపల్లి బ్రహ్మం, 12 మంది డైరెక్టర్లతో యార్డు ఆవరణలో అంగరంగ వైభవంగా ప్రమాణస్వీకారోత్సం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరు జగన్మోహనరెడ్డి పరిపాలనను బాగుందని అంటుంటే గిట్టనివారు, ప్రతిపక్షాలు అర్థంలేని ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వవిప్ ఉదయభానుకు మంత్రిగా సంపూర్ణ సహాయ సహకారాలను అందిస్తానన్నారు. రాబోవు ఎన్నికల్లో ఉదయభానును గెలిపించాలని కోరారు. శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ రెచ్చగొడితే ఓట్లు పడతాయని ప్రతిపక్షాల వారు అనుకోవటం వారి మూర్ఖత్వమన్నారు. చంద్రబాబుకు ఉనికి కోసం ఆరాటమే కాని ప్రజల కోసం పోరాటం లేదని ఎద్దేవా చేశారు. ఒకడు తొడకొడుతున్నాడు, ఒకడు మీసం తిప్పుతున్నాడు, మరొకడు చెప్పు చూపిసూత ఏమేమో మాట్లాడుతున్నాడు వీరెంతగా గింజుకున్నా వచ్చేది వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వమేనన్నారు. జగ్గయ్యపేటలో కూడా ఉదయభాను గెలుపు తధ్యమన్నారు.



జగ్గయ్యపేటలో స్విమ్మింగ్‌పూల్ ప్రారంభించి స్విమ్మర్లతో మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి, శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, ఎంఎల్‌ఏ సామినేని ఉదయభాను

యువత కూడా రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. జగ్గయ్యపేటను ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు ప్రభుత్వవిప్ ఉదయభాను పేర్కొన్నారు. కాగా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కెడిసిసి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణప్రసాదు, మున్సిపల్ వైస్-చైర్మన్లు తుమ్మల ప్రభాకరరావు, హాఫీజున్నీసా పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పట్టణ వైసిపి అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, డ్రీమర్స్-కృష్ణా స్విమ్మర్లు పాల్గొన్నారు. తొలుత చిల్లకల్లు వద్ద అతిథులకు ఉదయభాను ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి వేదిక వద్దకు భారీ ర్యాలీ నిర్వహించారు.



జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగారైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఆర్‌ఎం రమణారెడ్డి

# దేశ ఐక్యతకు పునరంకితమవుదాం

## రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా రైల్వే సిబ్బంది ప్రతిజ్ఞ

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** జాతీయ సమైక్యత, సమగ్రతలను పటిష్టపరిచే క్రమంలో ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలసిన అవసరం ఎంతైనా ఉందని గుంతకల్లు డివిజన్‌రైల్వే మేనేజర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. దేశ తొలి ఉప ప్రధాని, కేంద్ర హోం మంత్రి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 147వ జయంతి వేడుకల్లో భాగంగా, దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో ఆడంబరంగా, నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డిఆర్‌ఎం రమణారెడ్డి, రైల్వే సిబ్బందిచే..ౕ దేశ ఐక్యతకై జాతీయ సమైక్యత, సమగ్రతలను అవరోధపరిచే,కుల తత్వం, మతతత్వం, ప్రాంతీయవాదం, భాషోన్మాదం, వంటి వైఫల్యాలను విడనాడి, దేశ సార్వభౌమత్వానికి సోదరా భావంతో కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలోఅదనపు డిఆర్‌ఎంలు సూర్యనారాయణ, మురళీ కృష్ణ, ఆయా విభాగాల రైల్వే ఉన్నతాధికారులు జయశంకర్‌చౌహాన్, ప్రదీప్‌బాబు, ప్రశాంత్‌కుమార్, బాలాజీ కిరణ్, సెల్వకుమార్, కిశోర్‌కుమార్, సుధర్శన్‌రెడ్డి, గంగారాజు, మల్లికార్జున, పుష్పరాజ్, మంగాచార్యులు, తులసిరాం, రామస్వామి, రైల్వే పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూధనరావు అధిక సంఖ్యలో రైల్వే సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

# బిజెపి నేతల్లారా.. నోరు అదుపులో పెట్టుకోండి

- కమ్యూనిస్టులను విమర్శించే నైతికహక్కు మీకు లేదు
- మునుగోడులో టీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** భారతీయ జనాతా పార్టీ(బీజేపీ) నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని.. లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని సీపీఐఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. కమ్యూనిస్టులను విమర్శించే నైతిక హక్కు బీజేపీ నాయకులకు లేదన్నారు. కమ్యూనిస్టులు టీఆర్‌ఎస్‌కు మద్దతు నప్రకటించడాన్ని బీజేపీ నాయకులు భరించలేపోతున్నారని.. టీఆర్‌ఎస్ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలుస్తారని వారికి అర్థం అయిందని.. అందుకే కమ్యూనిస్టులపై నోటికొచ్చినట్టు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండి పడ్డారు. టీఆర్‌ఎస్‌కు కమ్యూ నిస్టులు అమ్ముడుపోయారని విమరిస్తున్నారని.. నిజాయితీగా ఉండే కమ్యూనిస్టుల గురించి బీజేపీ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్యతో కలిసి తమ్మినేని వీరభద్రం మీడియాతో మాట్లాడారు. అమ్ముడుపోయే చరిత్ర కమ్యూనిస్టులకు లేదని తమ్మినేని స్పష్టం చేశారు. రూ. 22 వేల కోట్ల కాంట్రాక్ట్ రాలేదని.. కేవలం రూ. 18 వేల కోట్ల కాంట్రాక్టే వచ్చిందని బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్తున్నారని అన్నారు. ఇలాంటి అమ్ముడుపోయిన వారు పవిత్రమైన కమ్యూనిస్టులపై అంభాండాలు వేయడం సిగ్గు చేటన్నారు. బీజేపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని.. లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని తమ్మినేని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పాగా వేయాలన్న కుట్రలో భాగంగానే మునుగోడు ఉప ఎన్నిక వచ్చిందన్నారు. కాంగ్రెస్‌ను బలహీనం చేసి.. రాబోయే సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ అని నిరూపించేందుకు ఈ ఉప ఎన్నికలొచ్చాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చే కుట్రతోనే టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం సాగిందని తమ్మినేని విమర్శించారు. బీజేపీ నాయకులకు తెలియకుండానే కేంద్ర నాయకులు స్వామిజీలను పంపించిందన్నారు. దేశంలోని 7, 8 రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలను కూల్చి కుట్రలు చేసి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలను లొంగదీసుకునేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి.. ఈడీ, సీబీఐని ప్రయోగిస్తున్నదని తమ్మినేని చెప్పారు. గత నెల 20న మునుగోడు సభలో రాజగోపాల్‌రెడ్డిని గెలిపించండి నెల రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని కూల్చుతామంటూ సాక్షాత్తు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. అందులో భాగంగానే నలుగురు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని చూశారని తమ్మినేని విమర్శించారు.

